

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**ఆ రాత్రి త్రివిక్రం** తన తండ్రి గదిలోకి వెళ్ళాడు. ఆయన త్రివిక్రం వంక కొత్త వ్యక్తిని చూసినట్లుగా చూసాడు. ఆయన మెదడులోని సెల్స్ కొన్ని నశించడం వల్ల కొడుకుని గుర్తుపట్టలేకపోయాడు. భోజనం చేసిన విషయం కూడా గుర్తుండనంత అధ్వాన్న స్థితిలోకి దిగజారాడు రాంప్రసాద్.

నిత్యం త్రివిక్రం తండ్రితో కాసేపు కబుర్లు చెప్తాడు. అవన్నీ ఆయనకి తెలిసినవే అయినా, ఆ మనుషులు, ప్రదేశాలు అర్థంకానట్లుగా చూస్తాడు. తండ్రి అనారోగ్యం తన జీవితంలోని పెద్ద ట్రాజెడీ అనుకుంటాడు త్రివిక్రం. ఆయన నిద్రపోగానే లేచి తన బెడ్‌రూంలోకి వెళ్ళిపోయాడు.

జనరల్ సర్జన్ అయిన త్రివిక్రం మర్నాడు ఉదయం పన్నెండింటికి తన సీనియర్ డాక్టర్‌తో కలిసి థైరాడెక్టమి ఆపరేషన్ చేసాడు. అందుకు ఎక్స్‌పోజర్, రెసెక్షన్, క్లోజర్ అనే మూడు స్టెప్స్ పూర్తిచేసాడు. ఆ సరికి మధ్యాహ్నం మూడు దాటింది. అతను ఖాళీగా ఉండటంతో అప్పుడే వచ్చిన ఓ శవానికి పోస్ట్‌మార్టం డ్యూటీని వేసాడు సూపరింటెండెంట్.

అలసిపోయిన త్రివిక్రం క్యాంటిన్‌కి వెళ్ళి రెండు సమోసాలు తిని టీ తాగాడు. జేబులోంచి సెల్‌ఫోన్ తీసి మిస్డ్ కాల్స్ కోసం చూసాడు. రెండు మిస్డ్ కాల్స్ ఉన్నాయి. రెండూ కొత్త నంబర్లే. మొదటి దానికి ఫోన్ చేస్తే, అది స్విచ్ ఆఫ్ చేసి ఉంది. తర్వాత రెండో దానికి చేసాడు.

"హలో" ఓ స్త్రీ కంఠం వినిపించింది.

"హలో! నేను డాక్టర్ త్రివిక్రంని. నా సెల్‌లో మీ మిస్డ్ కాల్ చూసి ఫోన్ చేస్తున్నాను."

"నేను సుభద్రని. మా అమ్మ, మీ అమ్మ కలిసి షాపింగ్‌కి వెళ్ళి చాలాసేపయింది. వాళ్ళింకా ఇంటికి రాలేదు. ఎప్పుడొస్తారో నీకు తెలుసేమోనని ఫోన్ చేసాను."

"నాకు తెలీదు. బహుశా వాళ్ళు దారిలో ఉండచ్చు. మా నాన్నగారికి కొంచెం టీ కలిపి ఇవ్వు. మూడు, మూడున్నరకి ఆయనకి టీ అలవాటు."

"అలాగే" చెప్పింది సుభద్ర.

"నాకు పోస్ట్‌మార్టం డ్యూటీ ఉంది. అదవగానే ఇంటికి వస్తానని మా అమ్మ రాగానే చెప్పు."

"అలాగే."

సెల్ ఫోన్ జేబులో ఉంచుకుని వేరే బిల్డింగ్‌లో పోస్ట్‌మార్టం డ్యూటీ ఉండటంతో అక్కడికి వెళ్ళాడు. పోస్ట్‌మార్టంకి అటెండెంట్ ఇచ్చిన గ్లౌస్ తొడుక్కున్నాడు.

"యాక్సిడెంట్ కేస్ సార్" చెప్పాడు అతను.

"మగా? ఆడా?"

"ఆడదే సార్."

లోపల ఏర్పాట్లు పూర్తవగానే ముక్కుకి మాస్క్‌ని ధరించి లోపలికి వెళ్ళాడు త్రివిక్రం.

జీవించి ఉన్న మనిషికి ఆపరేషన్ చేయడానికి ఉపయోగించే ఆపరేషన్ థియేటర్‌లా ఉండదది. శవానికి ఇన్‌ఫెక్షన్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. కాబట్టి సాదాసీదాగా ఉంటుంది. ముందర అక్కడున్న పరికరాలని త్రివిక్రం చెక్ చేసాడు. కొద్ది క్షణాల్లో ఓ మృతదేహాన్ని పక్కనే ఉన్న మార్చురీ నించి స్ట్రెచర్‌లో తీసుకువచ్చి స్టీల్ టేబుల్ మీద అడుగున ఉన్న దుప్పటి అంచులని ఎత్తి పడుకోబెట్టారు.

త్రివిక్రం ఛార్ట్‌లోని డెడ్ బాడీ వివరాల గురించి చదివాక దాన్ని పక్కన పెట్టి, ముందు శవం అరికాళ్ళ దగ్గరి దుప్పటిని తొలగించి అరికాలి మీద స్కాల్‌పెల్‌తో గీసాడు. బ్రతికున్న వాళ్ళయితే ఆ చిన్న కత్తి స్పర్శకి కాళ్ళని కదుపుతారు. తర్వాత అతను చేసే పని శవం కనుగుడ్డులోకి టార్చ్‌లైట్ వేసి పరీక్షించడం. బ్రతికుంటే, ఆ వెలుగుకి గుడ్డులో రియాక్షన్ వస్తుంది. టార్చ్‌లైట్ అందుకుని శవం ముఖం మీది దుప్పటిని కిందకి లాగాడు. మూసుకుని ఉన్న కుడి కనురెప్పని పైకి ఎత్తబోతూ ఠక్కున ఆగిపోయి తక్షణం ఓ అడుగు వెనక్కి వేసాడు. అతని నోట్లోంచి 'అమ్మా!' అనే చిన్నకేక వినిపించింది.

పోస్ట్‌మార్టమ్‌కి సిద్ధంగా ఉన్న పేరు తెలియని ఆ శవం జననిది.

ఆ అనామక శవం అతని తల్లిది.

త్రివిక్రం వెంటనే పోస్టుమార్టం ఆపి బయటికి వచ్చాడు. ఆ షాక్ నించి తేరుకోవడానికి అతనికి చాలాసేపు పట్టింది. ఈలోగా తన తల్లి శవాన్ని అక్కడికి చేర్చిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసాడు. వృత్తిరీత్యా వారితో అతనికి పరిచయమే. ఎస్.ఐ. లైన్‌లో రాగానే అడిగాడు.

"జనని అనే ఆవిడ శవాన్ని ఇవాళ ఉదయం మార్చురీకి తరలించారు. ఆవిడకి ఎక్కడ యాక్సిడెంట్ అయింది?"

"ఇవాళ మధ్యాహ్నం అబిడ్స్‌లో ఆవిడ సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ రోడ్డుని క్రాస్ చేసేప్పుడు ఓ కారు వచ్చి గుద్దింది. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూండటంతో పూర్తి అటెన్షన్ ట్రాఫిక్ మీద ఉండక ఇలా జరిగింది."

"ఆవిడతో ఉన్న ఇంకెవరైనా కూడా యాక్సిడెంటైందా?"

"లేదు."

"జనని మా అమ్మ. నాకు ఇంతదాకా మీరెవరూ ఆవిడ యాక్సిడెంట్ సంగతి ఇన్‌ఫాం చేయలేదే?"

"మై గుడ్‌నెస్. మీ అమ్మా ఆవిడ? సెల్‌ఫోన్ డేమేజ్ అవటంతో అందులోని నెంబర్లని తెలుసుకోలేకపోయాం. హ్యాండ్‌బాగ్‌లోని బేంక్ పాస్‌బుక్‌ని చూసి ఇంటి చిరునామా మాత్రం కనుక్కున్నాను. కానిస్టేబుల్‌ని ఇంటికి పంపించి ఇంట్లో ఉన్న ఒకాయనకి చెప్పాం. ఆయన సరేనన్నాడు."

సుభద్ర ఏమైంది? బాత్‌రూంలో ఉండి ఉండచ్చు. చిన్నగా నిట్టూర్చాడు త్రివిక్రం. తన తండ్రికి జరిగింది సరిగ్గా అర్థమై ఉండదు.

"ఓ.కే. థాంక్స్ ఎనీ వే"

"మై కండొలెన్సెస్ టు యు డాక్టర్ త్రివిక్రం" బాధగా చెప్పాడు ఎస్.ఐ

త్రివిక్రం ఫోన్ పెట్టేసి సరాసరి హాస్పిటల్ సూపరింటెండెంట్ కార్యాలయానికి వెళ్ళాడు. ఆయనతో చెప్పాడు.

"నాకు పోస్టుమార్టం డ్యూటీ వేసారు. కానీ నేను ఆ శవానికి పోస్టుమార్టం చేయలేను."

ఆయన కనుబొమలు పైకి లేచాయి.

"ఏం?" అడిగాడు.

"ఆవిడ నా స్వంత తల్లి. నేను ఆవిడ చేసిన బ్రేక్‌ఫాస్ట్ తిని ఉదయం హాస్పిటల్‌కి వచ్చాను. ఇప్పుడు ఆవిడ శవమై నాకు పోస్టుమార్టం టేబుల్ మీద తారసపడింది." దుఃఖంతో త్రివిక్రం గొంతు పూడుకుపోయింది.

"ఓ! అయాం సో సారీ. సరే. ఇంకెవరినైనా చేయమంటాను" బాధగా చెప్పాడాయన.

"థాంక్స్ సర్."

"అవునూ. ఉదయం యాక్సిడెంట్ అయితే సాయంత్రానికే పోస్టుమార్టం టేబుల్ మీదకి ఆ డెడ్ బాడీ ఎలా వచ్చింది? నిన్న, మొన్నటి శవాలు చాలా పెండింగ్‌లో ఉండగా దీన్ని ఎవరు మీకిచ్చారు?"

వెంటనే సూపరింటెండెంట్ ఆ విషయం మీద పోస్టుమార్టం సెక్షన్ ఇన్‌ఛార్జ్‌తో టెలిఫోన్‌లో మాట్లాడాక జరిగిన పొరపాటు బయటపడింది. 27 వాల్ట్‌లోని శవం ఇవ్వడానికి బదులు 37 వాల్ట్‌లోని శవాన్ని త్రివిక్రంకి ఇచ్చాడు.

"సరే. డాక్టర్ విరజ చేత వెంటనే పోస్టుమార్టంని పూర్తి చేయించి బాడీని హేండోవర్ చేయడానికి సిద్ధంగా ఉంచండి" ఫోన్‌లోనే సూచనలిచ్చి, ఫోన్ పెట్టేసి సూపరింటెండెంట్ త్రివిక్రంతో చెప్పాడు.

"త్రివిక్రం! ఇవాళ పి.యం కంప్లీట్ అవుతుంది. మీరు డెడ్ బాడీని తీసుకుని చీకటి పడేలోగా ఫ్యూనరల్ చేయలేరు. రేపు తీసుకోండి."

"అలాగే సార్"

త్రివిక్రం ఆయన గదిలోంచి బయటకి వచ్చాడు. తనకో మనిషి సహాయం అవసరం అని భావించి, తన సెల్ ఫోన్ తీసుకుని తనకి సహాయం చేయడానికి ఎవరికి ఫోన్ చేయాలా అని నెంబర్ల జాబితాని చూసాడు. కొన్ని పేర్లు చూసాక శ్యామలరావు పేరు, పక్కనే మార్గదర్శి చిట్‌ఫండ్ అన్న పేరుని చూసి ఆ నెంబర్‌కి ఫోన్ చేసాడు. అవతలి వైపు కొద్ది క్షణాల్లో ఎత్తారు.

"హలో డాక్టర్‌గారూ చెప్పండి" శ్యామలరావు కంఠం వినిపించింది.

"రావుగారూ. మా అమ్మ పోయింది" త్రివిక్రంకి మళ్ళీ ఏడుపు తన్నుకు వచ్చింది.

"ఏమిటి సార్? ఏమంటున్నారు?" అవతల నించి అయోమయంగా అడిగాడు శ్యామలరావు.

"మా అమ్మ రోడ్డు యాక్సిడెంట్‌లో పోయింది."

"అరెరె! వెంటనే మీ ఇంటికి వస్తున్నాను.

"నేను ఉన్నది ఇంట్లో కాదు. గాంధీ హాస్పిటల్‌లో పోస్ట్‌మార్టం బిల్డింగ్‌లో"

"సరే. అక్కడికే వస్తాను"

"రండి నాకంతా అయోమయంగా ఉంది."

"పావుగంటలో మీ దగ్గర ఉంటాను సార్" చెప్పాడు శ్యామలరావు.

"శ్యామలరావు మీ ఫ్రెండా సార్?" అడిగింది ఓ నర్స్.

అప్పటికే ఈ సంగతి తెలిసిన హాస్పిటల్‌లో ఉన్న మెడికల్ స్టాఫ్‌లో కొందరు పోస్టుమార్టం బిల్డింగ్ దగ్గరికి త్రివిక్రంకి తమ సంతాపాన్ని తెలియచేయడానికి వచ్చారు.

"కాదు. నెలనెలా చిట్ అమౌంట్ తీసుకోవడానికి వస్తూంటాడు. అతనిది ఇతరులకి సహాయం చేసే స్వభావం. ఓసారి నేను ఊళ్ళో లేనప్పుడు మా అమ్మకి రైలు టిక్కెట్‌ని రిజర్వ్ చేయించి పెట్టాడు. మరోసారి మా నాన్నగారి కళ్ళజోడు ఫ్రేమ్‌కున్న పిన్ విరిగితే రిపేర్ చేయించి పెట్టాడు."

త్రివిక్రంకి టీ తెచ్చిచ్చారు ఒకరు. బంధువులకి ఫోన్ చేయమని మరొకరు సూచించారు. అతని తండ్రికి గల వ్యాధి గురించి తెలిసిన వాళ్ళు ఆయన దగ్గర ఎవరైనా ఉంటే మంచిదని చెప్పారు.

పాతిక నిమిషాల్ అతర్వాత శ్యామలరావు వచ్చాడు. అతని మొహం విషాదంగా ఉంది.

"ఛీ హైదరాబాద్ ట్రాఫిక్ నానాటికీ నాశనం అవుతోంది సార్. ఆవిడకి జరగాల్సింది కాదిది. చెప్పాల్సిన అందరికీ చెప్పారా?" బాధగా చెప్పాడు.

"ఇంకా లేదు"

"ఏదీ? మీ ఫోన్ ఇటివ్వండి. ఎవరికి చెప్పాలో చెప్పండి. నేను చెప్తాను."

త్రివిక్రం సెల్ ఫోన్ తీసుకుని శ్యామలరావు అతని సూచనల ప్రకారం అతని బంధువులకి ఒక్కొక్కరికి ఫోన్ చేసి ఈ విషాదవార్తని చెప్పాడు.

వరంగల్‌లోని త్రివిక్రం పిన్నికి, ఖర్గపూర్‌లోని మేనమామ సుదర్శన్‌కి, అతని కజిన్‌కీ, అతని తండ్రివైపు కొందరు బంధువులకి చెప్పాడు.

"రేపు బాడీని స్మశానానికి తీసుకెళ్ళడానికి ఏర్పాట్లు చేసారా?" ఆ పనయ్యాక అడిగాడు.

"లేదు"

"నేను చేయనా? మూడు నెలల క్రితం సనత్‌నగర్‌లో మా బాబాయ్ పోయారు. నాకు ఈ విషయంలో కొద్దిగా అనుభవం ఉంది. ఆ పనులన్నీ నేనే చేసాను."

"ప్లీజ్. చెయ్యండి."

అంత బాధలో కూడా తన తల్లి కళ్ళని తీసుకెళ్ళడానికి ఏదైనా ఐ బ్యాంక్‌కి ఇన్‌ఫాం చేయమని ఓ నర్స్‌కి పురమాయించాడు త్రివిక్రం. నర్స్ వెంటనే ఎవరికో ఫోన్ చేసి ఆ సంగతి చెప్పింది.

"పోస్ట్‌మార్టం మొదలవ్వాల్సి ఉంది. మీరు వెంటనే వచ్చి కళ్ళని తీసుకెళ్ళాక అది స్టార్ట్ చేస్తాం."

వాళ్ళతో మాట్లాడాక త్రివిక్రంతో చెప్పింది.

"పావుగంటలో వస్తారట."

"ఆ కారు డ్రైవర్ ఎవరో పోలీసులు ట్రేస్ చేసారా?" ఇంకో నర్స్ అడిగింది త్రివిక్రంని.

"నేనడగలేదు. చేసినా ఇక ఆ డ్రైవర్ మా అమ్మని బ్రతికించి తీసుకురాగలడా?" నిర్లిప్తంగా చెప్పాడు త్రివిక్రం.

త్రివిక్రంతో పాటు దాదాపు గంటన్నర దాకా శ్యామలరావు అక్కడే ఉన్నాడు. డాక్టర్ విరజ వచ్చి త్రివిక్రంకి తన సానుభూతిని తెలియచేసింది.

ఆ సరికి ఐ బ్యాంక్ వాళ్ళు వచ్చి జనని ఐరిస్‌ని తీసుకువెళ్ళారు. దాదాపు గంటన్నర పోస్టుమార్టం చేసాక డాక్టర్ విరజ బయటకి వచ్చి చెప్పింది.

"డాక్టర్ త్రివిక్రం. ఓ సారి మీరు పక్కకి వస్తారా?"

త్రివిక్రం ఆవిడతో పక్కకి వెళ్ళాడు. వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకోవటం అంతా గమనించారు. ఆవిడ చెప్పేదాన్ని వ్యతిరేకిస్తూ త్రివిక్రం తల అడ్డంగా ఊపుతూ కాదంటున్నాడు. అతనికి నచ్చచెప్పడానికి ఆవిడ ప్రయత్నిస్తోంది.

కొద్ది క్షణాల తర్వాత త్రివిక్రం ఆవిడ వెంట పోస్టుమార్టం గదిలోకి వెళ్ళి అయిదునిమిషాల తర్వాత బయటకి వచ్చాడు. అతని మొహం పూర్వం కన్నా వాడిపోయి ఉండటం అంతా గమనించారు.

"సార్. ఈ రాత్రికి బాడీ ఇక్కడే ఉంటుంది కదా?" అడిగాడు శ్యామలరావు.

"అవును."

"నేను వెళ్ళిరానా? రేపు ఉదయం తొమ్మిదికల్లా మీ ఇంటికి వస్తాను."

"అలాగే. అన్నట్లు రేపటి ఏర్పాట్లకి డబ్బు కావాలి కదా?"

"రేపు కొంత డబ్బు డ్రా చేసి ఉంచండి. లేదా నేను వచ్చాక చెక్ ఇస్తే డ్రా చేసి తెస్తాను."

శ్యామలరావు అతని దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

డాక్టర్ విరజ పోస్టుమార్టం పూర్తి చేసి బాడీలో దూది, కర్పూరం వేసి కుట్టేసి బయటకి వచ్చింది. సాధారణంగా ఆ పని కింది స్టాఫ్ చేస్తారు. కానీ తన కొలీగ్ తల్లి కాబట్టి ఆ పని కూడా ఆవిడే పూర్తి చేసింది. జనని మరణానికి కారణం లివర్ పంక్చర్ అవడం, ఇంటర్నల్ హెమరేజ్‌గా త్రివిక్రంకి చెప్పింది.

"అదృష్టం. ఆవిడకి యాక్సిడెంట్ అయిన తక్షణం షాక్‌తో కోమాలోకి వెళ్ళిపోయి ఉంటుంది. బాధేమిటో తెలీకుండానే కొద్ది నిమిషాల్లో ప్రాణం పోయి ఉంటుంది. అంబులెన్స్‌లోకి ఎక్కించే సమయానికే ఆవిడ మరణించిందని పేరామెడికల్ స్టాఫ్ రిపోర్ట్" చెప్పిందామె.

త్రివిక్రం నిస్సత్తువుగా తన కారు దగ్గరికి చేరుకున్నాడు. సరాసరి ఇంటికి వెళ్ళాడు. తన అపార్ట్‌మెంట్ తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళగానే ఎదుటి గదిలో అపరాధభావంతో కూర్చుని ఉన్న సుభద్ర, తిరుమలాంబ, ఆవిడ భర్త కనిపించారు. అతన్ని చూడగానే ముగ్గురూ చప్పున లేచి నించున్నారు.

"నీ కోసమే ఎదురు చూస్తున్నాం." చెప్పాడు సుభద్ర తండ్రి ఉద్వేగంగా.

"ఓ పెద్ద దుర్ఘటన జరిగింది బాబూ" తిరుమలాంబ వెక్కుతూ చెప్పింది.

"అది నీకు చెప్పాలని హాస్పిటల్‌కి వస్తే నువ్వు ఆపరేషన్‌లో ఉన్నావని చెప్పారు. అక్కడి అటెండెంట్‌కి నువ్వు బయటకి రాగానే నాకు ఫోన్ చేయమని చెప్పమని అతనికి నా నెంబర్ రాసిచ్చాను. కానీ నీ నించి ఫోన్ రాలేదు. మీ అమ్మగారు.."

"తెలుసు. ఇప్పుడే ఆవిడ డెడ్‌బాడీకి పోస్టుమార్టం అయింది. ఎలా జరిగిందిది?" అడిగాడు త్రివిక్రం.

"చీరలు కొన్నాక ఇద్దరం రోడ్డు క్రాస్ చేసి అవతల ఆగి ఉన్న మా కారు దగ్గరకి వెళ్తున్నాం. నేను దాటేసాను కానీ, మీ అమ్మ దాటడం కొద్ది క్షణాలు ఆలస్యం చేసింది. ఇంతలో ఓ మబ్బు రంగు కారు వచ్చి మీ అమ్మని కొట్టేసింది. ఆవిడ అరుపుకి నేను వెనక్కి తిరిగి చూసాను." తిరుమలాంబ కంఠం దుఃఖంతో బొంగురు పోయింది.

"వెంటనే ఎవరో ఆ108కి ఫోన్ చేసారు. వాళ్ళొచ్చేసరికే..." ఆయన చెప్పడం ఆపేసాడు.

"తప్పు నాదే ఇంట్లో ఉన్న మీ అమ్మ దగ్గరకి వచ్చి తోడు రమ్మని నేనే వెంట తీసుకెళ్ళాను" తిరుమలాంబ కన్నీళ్ళతో చెప్పింది.

"నాన్నగారితో చెప్పారా?" అడిగాడు త్రివిక్రం.

"ఆ. ఆయనకి మేం చెప్పింది సరిగ్గా బోధపడలేదనుకుంటాను. ఏం రియాక్షన్ లేదు."

"అదృష్టవంతుడు" చెప్పాడు త్రివిక్రం.

ఆవిడ ఫ్రిజ్‌లోని నాలుగు బ్రెడ్ స్లయిస్‌కి పీనట్ బటర్ రాసిచ్చి త్రివిక్రం చేత బలవంతంగా తినిపించింది. లాండ్ లైన్ మోగింది. రిసీవర్ అందుకుని చెప్పాడు.

"హలో?"

"హల్లో. నేను పిన్నిని రా. ఇంటికి వచ్చావా? ఇందాక ఫోన్ చేస్తే నువ్వు ఇంకా ఇంటికి రాలేదన్నారు. నీ సెల్ నంబర్ తెలీదు. ఎలా జరిగిందీ ఘోరం?" దుఃఖంగా వినిపించిందో ఆడ కంఠం.

ఒక్కో బంధువు నించి లాండ్ లైన్‌కి ఫోన్ కాల్స్ రాసాగాయి. కొందరు వెంటనే బయలుదేరి వస్తున్నామని చెపితే, మరి కొందరు పదో రోజుకి వస్తామని చెప్పారు. తిరుమలాంబ వాళ్ళు రాత్రి పదిన్నర దాకా ఉండి, అతను 'ఫర్వాలేదు. వెళ్ళండి' అంటే మర్నాడు ఉదయం వస్తామని బాధగా చెప్పి వెళ్ళిపోయారు.

తండ్రి దగ్గరికి వెళ్ళాడు త్రివిక్రం. రాంప్రసాద్ త్రివిక్రం వంక ఎప్పటిలానే కొత్త వ్యక్తి వంక చూసినట్లుగా చూసాడు.

"నాన్నగారూ, అమ్మ యాక్సిడెంట్‌లో పోయిందని మీకు సుభద్రా వాళ్ళు చెప్పారు. అది అర్థమైందా?" అడిగాడు.

ఆయన కళ్ళల్లో స్వల్పంగా బాధ తొంగి చూసింది కానీ, కొద్దిసేపటిలోనే ఆ సంగతి మర్చిపోవడంతో మాములుగా అయిపోయాడు.

"ఆహా! మరపు ఎంత చక్కటి ఔషధం" అనుకున్నాడు త్రివిక్రం.

తరచూ రాత్రి నిద్రపోబోయే ముందు తండ్రి పూర్వం రాసిన డైరీల్లోని కొన్ని పేజీలని చదవడం త్రివిక్రంకి అలవాటు. తండ్రికి అల్జిమేర్స్ వ్యాధి వచ్చిందని తెలిసాక ఇంటర్నెట్‌లో ఆ వ్యాధి గురించి దొరికిన కొన్ని సూచనలలో ఇదొకటి. పాత విషయాల గురించి ఆ రోగగ్రస్థులు వింటే వారిలో జ్ఞాపకాలు తిరిగి రావచ్చని స్పెయిన్‌కి చెందిన ఓ డాక్టర్ ఓ వెబ్‌సైట్‌లో సూచించడంతో, అది చదివినప్పటినించీ త్రివిక్రం ప్రతిరాత్రి తండ్రి పాత డైరీలు తీసి ఆయన ముందు బయటకి చదువుతున్నాడు. తల్లి పోయిన బాధని మరవడానికి త్రివిక్రం తండ్రికి అవి చదివి వినిపించసాగాడు.

1975 మే ఆరు: ఇవాళ పనిమీద ఇంటినించి సైఫాబాద్ కాలనీలోని నా కొలీగ్ మధుసూదనరావు ఇంటికి, బోయిగూడాలోని ఇంకో కొలీగ్ రషీద్ ఇంటికి వెళ్ళొచ్చాను. తొమ్మిది రూపాయల పది పైసలు ఆటోకి అయింది. పదిచ్చి చిల్లర తీసుకోలేదు. ఆటోవాడు సంతోషించాడు.

ఆయన అది విని కూడా బ్లాంక్‌గా చూసాడు తప్ప ఆ సమాచారాన్ని గుర్తుపట్టిన ఆనవాళ్ళేం ఆయన మొహంలో లేవు. 'అసలు తనకి తనెవరో తెలుసా?' అన్న అనుమానం కలిగి తండ్రి వంక చూస్తూ అడిగాడు త్రివిక్రం.

"మీరెవరో చెప్పండి. మీరెవరు?"

"నేను...నేను..."

"అవును. మీరే. మీ పేరు?"

"నా పేరు.. నా పేరు..." తడుముకుంటూ ఆగిపోయాడు.

"మీరేం ఉద్యోగం చేసేవాళ్ళు?"

"ఏం చేసేవాడినంటే ఏమో?"

"మీ పేరు?

"తెలీదు."

"మీ పేరు రాంప్రసాద్" చెప్పాడు త్రివిక్రం.

"అవును కదా. నా పేరు రాంప్రసాద్" వెంటనే చెప్పాడాయన.

తండ్రి డైరీలోని ఓ పేజీని తిప్పి చదివాడు. అది ఆయన ఎక్కడో చూసి రాసుకున్న జోక్. తెలుగులో తప్ప ఇతర భాషల్లోకి అనువదించడానికి వీలులేని జోక్ ఇది.

చాలా కాలం తర్వాత కలిసిన శాంభవి చెప్పిందిది.

"సుబ్బారావు పనివాడిని పిలిచి తన కొత్త ఇంటి గోడలకి సున్నాలు వేయమని సున్నం కొనిచ్చి పంపాడు. మర్నాడు వెళ్ళి చూస్తే తన ఇంటి గోడలనిండా సున్నంతో సున్నాలు చుట్టి ఉండటం చూసాడు."

ఆ జోక్ అంతకు ముందు ఎన్నడూ వినకపోవడం వల్ల త్రివిక్రంకి నవ్వొచ్చింది. కానీ రాం ప్రసాద్ మొహంలో నవ్వులేదు.

"మీ పేరేమిటి?" అడిగాడు త్రివిక్రం.

"నా పేరు...నా పేరు" తడుముకున్నాడు కానీ ఆయన జవాబు చెప్పలేకపోయాడు.

చిన్నగా నిట్టూర్చాడు త్రివిక్రం.

సాయంత్రం డాక్టర్ విరజ తనకి చెప్పిన రహస్యం అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది. ఈ పరిస్థితిలో ఉన్న తండ్రి తనకి కొత్తగా ఎదురైన ఆ రహస్యాన్ని ఛేదించడంలో ఏం తోడ్పడగలడు? ఏ కొడుక్కీ రాకూడని దుర్భర సమస్యలో తను చిక్కుకున్నాడు. తన తల్లి మరణించిందనే బాధ, ఈ కొత్త సమస్య తెచ్చిన బాధ వల్ల త్రివిక్రం మనసు నిండా బాధ పేరుకుంది.

మరణించిన తల్లి, బతికుండీ జ్ఞాపకాలు సర్వం మరణించిన తండ్రి. ఇక తనకంటూ ఈ లోకంలో ఒక్కరు కూడా లేరు. వివాహం చేసుకోమన్న తల్లి సలహా గుర్తుకు వచ్చింది. తనకి పెళ్ళయి పిల్లలు పుట్టేదాకా ఈ లోకంలో తను ఒంటరివాడే అనిపించింది. రకరకాల ఆలోచనలతో అతనికి నిద్రపట్టలేదు. పడుతూండగా రాత్రి పన్నెండున్నరకి త్రివిక్రం డోర్ బెల్ మోగింది.

వరంగల్ నించి అతని పిన్ని జానకి, ఆమె భర్త, ఇద్దరు కొడుకులు వచ్చారు. రాగానే పిన్ని బావురుమంది. త్రివిక్రంకి కూడా దుఃఖం ముంచుకు వచ్చింది. పావుగంట తర్వాత మిగిలినవాళ్ళు ఆ ఇద్దరినీ ఓదార్చారు.

అర్ధరాత్రి ఒకటిన్నరకి కరీంనగర్ నించి త్రివిక్రం బాబాయ్ సోమశేఖర్, తన భార్యతో వచ్చాడు. అతను రాం ప్రసాద్ చిన్నతమ్ముడు. తెల్లారుఝామున ఒంగోలు నించి తన పెద్ద కూతురితో మరో బాబాయ్ ఆదిశంకర్ రైల్లో వచ్చాడు. క్రితం ఏడాదే అతని భార్య కూడా మరణించింది. అప్పుడు జనని వెళ్ళి పదమూడు రోజులు ఒంగోలులో ఉండి వచ్చింది. ఆ రాత్రి నాలుగు గంటలు మించి త్రివిక్రంకి నిద్రలేదు.

మర్నాడు ఉదయం ఎనిమిదిన్నరకి శ్యామలరావు పురోహితుడిని వెంటపెట్టుకుని వచ్చాడు. పదిన్నరకి జనని శవాన్ని మార్చురీనించి తీసుకు వచ్చారు.

"సార్. చెక్ రాసిస్తే బేంక్ నించి డబ్బు డ్రా చేసి, శ్మశానానికి వెళ్ళి అక్కడ కట్టాల్సిన డబ్బు కట్టి చితికి రెడీ చేయించి వస్తాను. ఈలోగా ఇక్కడి కార్యక్రమం పూర్తి అవుతుంది. వంట మనిషిని కూడా మాట్లాడి తెచ్చాను. ఈ పన్నెండు రోజులు బంధువులు ఉంటారు కదా. వాళ్ళకి వంట చేయడానికి మనుషులు అవసరం."

"నాకేవేం తెలీవు. అంతా మీరే చూడండి. మీ సహాయానికి థాంక్స్." కృతజ్ఞతగా చూస్తూ చెప్పాడూ త్రివిక్రం.

"అమ్మగారు మీకెంతో నాకూ అంతే సార్. మీతో టచ్ తక్కువ కానీ ఆవిడతోనే నాకు టచ్. నెలనెలా వచ్చి చిట్ ఇన్‌స్టాల్‌మెంట్‌ని తీసుకెళ్తుంటాను కదా."

శ్యామలరావుకి ఏభైవేల రూపాయలకి బేరర్ చెక్ రాసిచ్చి చెప్పాడు.

"ఉంచండి. కార్యక్రమం అంతా పూర్తవడానికి ఇంతకి తక్కువకాదు కదా"

"అవును సార్. ఏ రోజుకి ఆ రోజు అంతా లెక్క రాసి ఇస్తాను" చెప్పి శ్యామలరావు బయటకి వెళ్ళిపోయాడు.

ఇది గమనించిన త్రివిక్రం బాబాయ్ సోమశేఖర్ అడిగాడు.

"ఇతన్ని ఎప్పుడూ చూడలేదు. ఎవరు ఇతను?"

"మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీ డెవలప్‌మెంట్ ఆఫీసర్. నెలనెలా చిట్ అమౌంట్‌ని వచ్చి తీసుకెళ్తుంటాడు."

"అంతే పరిచయమా?"

"అవును"

"అలా కొత్తవాళ్ళని ఎలా నమ్మగలం? ఆ చెక్‌ని మనవాళ్ళకి ఎవరికైనా ఇస్తే బావుండేది."

"అతను బాగా నమ్మదగ్గ వ్యక్తి. చిట్‌ఫండ్ తరపున నెలనెలా లక్షలకి లక్షలు హేండిల్ చేస్తూంటాడు. అసలు ఆ సంస్థలో నమ్మకస్థులు కాని వాళ్ళని చేర్చుకోరు బాబాయ్. ముఖ్యంగా అతనిలో హెల్పింగ్ నేచర్ ఎక్కువ."

"అలా అయితే సరే"

భార్య శవాన్ని చూసి రాంప్రసాద్ పెద్ద పెట్టున ఏడవసాగాడు. ఆవిడ తన భార్య అని, ఆమె మరణించిందని ఆయన బుర్ర అర్థం చేసుకోగలిగింది. ఆయన ఏడుపుని చూసి చాలామందికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

పురోహితుడు కర్మకాండని చేయించసాగాడు. పోస్ట్‌మార్టం చేయబడ్డ శవం కాబట్టి నీళ్ళతో స్నానం చేయించకుండా, కేవలం పసుపు నీళ్ళని మొహం మీద, తలమీద, ఒంటిమీద చల్లితే చాలని చెప్పాడు పురోహితుడు.

శ్యామలరావు ఇంటికి తీసుకు వచ్చిన క్షురకుడు ఆచారం ప్రకారం త్రివిక్రంకి గుండు చేసాడు. సైకిల్ మీద ఓ కుర్రాడు వెదురు బొంగులు తెచ్చి, వాటిని ఉపయోగించి ఏడుకట్ల పాడెని కట్టాడు. జనని శవాన్ని త్రివిక్రం, శ్యామలరావు, అతని ఇద్దరు బాబాయ్‌లు కలిసి పాడెమీదకి ఎక్కించారు.

శ్మాస్తానికి సందు చివరి దాకా పాడెని మోసుకెళ్ళాక అక్కడ ఆగి ఉన్న వాహనంలో దాన్ని ఎక్కించి తీసుకెళ్ళారు. శ్యామలరావు ముందే అన్ని ఏర్పాట్లు చేయడంతో అంతా సాఫీగా సాగింది. సికింద్రాబాద్‌లోని శ్మశానంలో చితి సిద్ధంగా ఉంది. శ్మశానికి అతనితోటి డాక్టర్లు ముగ్గురు, కొందరు కింది కేడర్ సిబ్బంది వచ్చారు. డాక్టర్ విరజ కూడా హాజరై వారిలో ఉంది.

అక్కడ పని పూర్తయ్యాక, త్రివిక్రం వెళ్ళబోయేముందు విరజ అతన్ని పక్కకి పిలిచి గొంతు తగ్గించి అడిగింది.

"నిన్న పోస్ట్‌మార్టమ్‌లో మీ తల్లికి గర్భాశయం లేదన్న సంగతి మీరు స్పష్టంగా చూసారు కదా?"

"అవును. మధ్యలో దాన్ని తొలగించలేదు. మా అమ్మకి పుట్టుకతోనే గర్భాశయం లేదు."

"మీ కళ్ళతో మీరు చూస్తే కాని దాన్ని నమ్మరని మిమ్మల్ని పిలిచి చూపించాను. మిమ్మల్ని ఆవిడ పెంపుడుకి తీసుకుని ఉంటారు."

"కానీ మా పేరెంట్స్ నన్ను పెంపుడుకి తీసుకున్నామని నాకింత దాకా ఎన్నడూ చెప్పలేదు"

"తమకి పిల్లలు పుట్టరని గ్రహించిన మీ పేరెంట్స్ మిమ్మల్ని బహుశ ఎవరైనా బంధుమిత్రుల నించి పెంపకానికి తీసుకుని ఉంటారు. ఈ కార్యక్రమాలన్నీ అయ్యాక మీరు ఎవరి నించి దత్తతకి వచ్చారో తెలుసుకునే ప్రయత్నం చేయండి."

"తప్పకుండా నిన్న నాకు ఈ సంగతి తెలిసినప్పటి నించి ఇది నాకు ఇంకో పెద్ద షాక్. నా తల్లిదండ్రులు ఎవరో తెలుసుకోవాలి అన్నది ఇప్పుడు నా ధ్యేయం. అంతదాకా నేను అనాధనే" డగ్గుత్తికగా చెప్పాడు త్రివికరం.

"ఈ విషయం నేను ఎవరితోనూ చెప్పనని మీకు మాట ఇచ్చాను. ఆఖరికి నా హస్బెండ్‌తో కూడా చెప్పలేదు. చెప్పను. వృత్తిరీత్యా నేనిది చెప్పకూడదు. అలాగే వ్యక్తిగతంగా మీ కొలీగ్‌గా కూడా ఈ రహస్యాన్ని కాపాడే బాధ్యత నా మీద ఉంది." అతను అడక్కుండానే హామీ ఇచ్చింది డాక్టర్ విరజ.

"థాంక్ యూ వెరీమచ్" కృతజ్ఞతగా చెప్పాడు డాక్టర్ త్రివిక్రమ్.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments